# కృతజ్ఞత సభలో అభివృద్ధి ప్రస్తావన ఎక్కడ?

- మిడ్జిల్ అభివృద్ధిపై స్పష్టత ఇవ్వాలి..
- అభివృద్ధి హామీలు ప్రకటించకుండా రాజకీయాలేనా..?
- సీఎం సభపై బీఆర్ఎస్ మండల నేత గంజి కృష్ణ ప్రశ్నల వర్షం



**మిడ్జిల్, జులై 5,( నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన కృతజ్ఞత సభపై బీఆర్ఎస్ మండల నాయకుడు గంజి కృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. సుమారు రూ.20 కోట్ల ప్రజాధనంతో నిర్వహించిన సభ ప్రజల అభివృద్ధి కోసమా, లేక బీఆర్ఎస్ అధినేతపై విమర్శలు చేసేందుకా అని ప్రశ్నించారు. మిడ్జిల్‌పై ప్రత్యేక ప్రేమ ఉందని చెప్పిన సీఎం, మండలానికి డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, బాలికల వసతి గృహం, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి, క్రీడా మైదానం, సాగునీటి ప్రాజెక్టులు, యువతకు ఉద్యోగాల వంటి ఒక్క కొత్త హామీ కూడా ప్రకటించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. కృతజ్ఞత సభ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రజలకు అభివృద్ధి వరాలు ప్రకటించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. సభలో ఖాళీ కుర్చీలు కనిపించడం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలు ఎక్కడ జరిగిందని నిలదీశారు. ప్రజాధనాన్ని రాజకీయ సభలకు ఖర్చు చేయడం కంటే గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాల అభివృద్ధికి వినియోగించి ఉంటే ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగేదని పేర్కొన్నారు. ప్రజలకు రాజకీయ ప్రసంగాలు కాదు, అభివృద్ధి, ఉద్యోగాలు, మెరుగైన విద్యా, వైద్య సౌకర్యాలే కావాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ప్రభుత్వ బాధ్యత అని గంజి కృష్ణ స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రి కృతజ్ఞత సభ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు: సర్పంచ్ బి. నాగరాజు గౌడ్



**మిడ్జిల్, జూలై 5 (నేటి దర్శిని ప్రతినిధి):** ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానానికి 20 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ చిల్వేర్ గ్రామ సర్పంచ్ బి. నాగరాజు గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సభకు భారీ సంఖ్యలో హాజరైన గ్రామ పెద్దలు, రైతులు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ విలువైన సమయాన్ని కేటాయించి సభ విజయవంతానికి విశేషంగా సహకరించారని పేర్కొన్నారు. అలాగే సభ నిర్వహణలో ప్రత్యక్షంగా, పరోక్షంగా శ్రమించిన ప్రతి నాయకుడు, కార్యకర్త, స్వచ్ఛంద సేవకుడు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, అందరి సమిష్టి సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించగలిగామని అన్నారు. ప్రజల ఆశీర్వాదాలు, కార్యకర్తల అంకితభావంతో ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతామని సర్పంచ్ బి. నాగరాజు గౌడ్ తెలిపారు.



# బండ్లగూడలో భారీ షెడ్ నిర్మాణం...

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో వేగంగా సాగుతున్న నిర్మాణ పనులు
- టౌన్ ప్లానింగ్ అధికారుల వైఖరిపై స్థానికుల అనుమానాలు
- నిర్మాణ అనుమతులు, నిబంధనలపై పూర్తి వివరాలు వెల్లడించాలని ప్రజల డిమాండ్

**కీసర సర్కిల్, జూలై 5 (నేటి దర్శిని):** కీసర సర్కిల్ పరిధిలోని బండ్లగూడ సమీపంలో భారీ షెడ్ నిర్మాణం వేగంగా కొనసాగుతుండగా, దీనికి సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా అనే అంశంపై స్థానికుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో జరుగుతున్న ఈ నిర్మాణంపై సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం, నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టినప్పుడు వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు, ఇంత పెద్ద నిర్మాణం విషయంలో మౌనం పాటించడం ఎందుకనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ నిర్మాణానికి సంబంధించి అన్ని అనుమతులు పొందారా? లేక నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారిక సమాచారం లేకపోవడంతో స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజకీయ ప్రభావం కారణంగానే అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నప్పటికీ, దీనిపై అధికారిక నిర్ధారణ లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు, ఉన్నతాధికారులు ఆ ప్రాంతాన్ని తరచూ సందర్శిస్తున్నప్పటికీ నిర్మాణాన్ని గుర్తించలేదా? లేదా దీనిపై పరిశీలన కొనసాగుతోందా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యవహారం మరోసారి చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో సంబంధిత డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలు, ప్రస్తుత పరిస్థితిపై పూర్తి వివరాలు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కృతజ్ఞత సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ నాయకుల ధన్యవాదాలు



**మిడ్జిల్, జూలై 5, (నేటి దర్శిని ప్రతినిధి):** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని మిడ్జిల్ మండల కేంద్రంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కృతజ్ఞత సభను విజయవంతం చేసిన ప్రజలు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరికీ మిడ్జిల్ మండల కాంగ్రెస్ నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ.. మిడ్జిల్ మండలం నుంచి జడ్పీటీసీ సభ్యునిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం మండల ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా నిర్వహించిన కృతజ్ఞత సభకు జడ్చర్ల నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేసిన ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే సభ నిర్వహణలో సహకరించిన జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు, కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు చూపిన అపూర్వ ఆదరణ, పార్టీ శ్రేణుల అంకితభావం కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి నాయకత్వంలో మిడ్జిల్ మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్, ఏఎంసీ మార్కెట్ చైర్మన్ ఆల్వాల జ్యోతి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్, మండల నాయకులు వెంకయ్య, మల్లికార్జున్ రెడ్డి, సంపత్ కుమార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: తోట మహేష్ యాదవ్




**చైతన్యపురి, జూలై05 (నేటి దర్శిని):** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి అర్హుడూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్ అన్నారు. చైతన్యపురి డివిజన్‌లో నిర్వహించిన SIR (Special Intensive Revision) ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల ధృవీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు వివరాలను సరిచూసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ కృష్ణవేణి, కొండల్ రెడ్డి, శ్రీరాములు, స్వప్న, బీఆర్ఎస్ బీఎల్ఏలు గణేష్, శ్రీశైలం యాదవ్, బాలు, రమేశ్, శ్రీకాంత్, మల్లేశ్ పాల్గొన్నారు. బూత్ నంబర్లు 27, 28, 29, 30, 31, 34, 41, 42 పరిధిలోని మారుతినగర్, ఫణిగిరి కాలనీలలో ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు నమోదు, సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు.

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

- బూత్ నెం. 208లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అధికారులతో సమీక్ష



**హయత్‌నగర్, జులై 5 (నేటి దర్శిని):** భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బూత్ నెం. 208ను ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి కార్యక్రమం పురోగతిని తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకునేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని కళ్లెం నవజీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్ శ్రీరాములు, బూత్ లెవల్ ఏజెంట్ శ్రీకాంత్‌తో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## 250 మంది అనాథ నిరుపేద పిల్లలకు అల్పాహారం

- చిన్నారి హారిక జన్మదినం సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం





**ఎల్.బి.నగర్, జూలై05 (నేటి దర్శిని):** చిన్నారి హారిక జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అనాథ మరియు నిరుపేద పిల్లల పాఠశాలలో అల్పాహార పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది అనాథ, నిరుపేద చిన్నారులు కడుపునిండా అల్పాహారం చేసి, చిన్నారి హారికకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షుడు డా. కపిల్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో సభ్యులు చిన్నారి హారికతో కేక్ కట్ చేయించి, ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, వర్ధంతులు తదితర ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను కృష్ణ గోపాల్ సేవా సమితి ద్వారా నిర్వహించాలనుకునే వారు 8106876999 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# ఎల్లమ్మ దేవాలయ భూమి కబ్జాపై దళితుల నిరసన




**ఆమనగల్లు,జులై05(నేటి దర్శిని):**
ఆమనగల్లు నవచైతన్య కాలనీలో తరాల నాటి ఎల్లమ్మ దేవాలయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అంటూ దళిత కుటుంబాలు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కొల్లూరు కృష్ణా దేవి అనే మహిళ తమపై అక్రమ కేసులు పెట్టించి ఏడాదిగా వేధిస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘం నేతలు మద్దతు ప్రకటించారు. అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ ఆలయ భూమిని కాపాడేందుకు కమిటీ సిద్ధం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, జంగయ్య, శంకర్,కిరణ్, కృష్ణ, శేఖర్, శ్రీశైలం, రాములమ్మ, వెంకటమ్మ, ఎల్లమ్మ, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.


# మిడ్జిల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎండి గౌస్ నియామకం



**మిడ్జిల్ జూలై 05,( నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ ఎండి గౌస్ నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆయనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా పనిచేస్తూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఎండి గౌస్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ఆయనకు మండల అధ్యక్ష పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీటీసీగా ప్రజలకు చేరువై పనిచేసిన ఎండి గౌస్‌కు మండల రాజకీయాలపై మంచి అవగాహన ఉందని, ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో మరింత బలోపేతం అవుతుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ లోని సౌత్ సెంట్రల్ రైల్వే జిఎం ని కలిసిన

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి



**మిడ్జిల్, జూలై 5,(నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :**
వారం రోజులక్రితం మరికల్ మండలంలోని బుడ్డాగాని తండాకు చెందిన బీజేపీ కార్యకర్తలు బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి ని కలిసి ఎంపి గారి ద్వారా రైల్ అండర్ బ్రిడ్జి రోడ్ ని రిపేర్ చేయించాలని కోరగా, వారి కోరిక మేరకు మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ తో కలిసి గుడిగండ్ల - బుడ్డగాని తాండ మధ్యలో రైల్వే అండర్ బ్రిడ్జి రిపేర్ చేయించాలని బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి అరుణమ్మ గారి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన జేజమ్మ రైల్వే అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలో రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర పాడైన రోడ్ ని మరమ్మతు చేయాలని కోరారు. అందులో బాగంగానే అరుణమ్మ గారి సూచనలతో సికింద్రాబాద్ ,రేల్ నిలయంలోని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ యం.శ్రీనివాస్ గారిని కలిసి వినతి పత్రం అందజేసిన బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, త్వరలోనే రైల్వే అధికారుల ద్వారా రోడ్ సర్వే చేయించి వీలైనంత త్వరలో రోడ్ రిపేర్ చేయిస్తామని జిమ్ తెలియజేశారన్నారు. ఇట్టి కార్యక్రమంలో రాయుడు నాయక్, పాండు నాయక్, తులసీరామ్ నాయక్ పాల్గొన్నారు.

# దేవరకొండ అభివృద్ధి, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నిరంతరం కృషి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే బాలు నాయక్



**హైదరాబాద్, జూలై 05 ( నేటి దర్శిని) :**
దేవరకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, స్థానిక విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా దేవరకొండ శాసనసభ్యులు శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క గారిని ఎమ్మెల్యే బాలు నాయక్ గారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పన, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సంబంధిత పనులను పూర్తి చేయడం, లో-వోల్టేజ్ సమస్యలు ఉన్న ప్రాంతాలలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు మరియు లైన్ల విస్తరణతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ గారు డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వివరించిన సమస్యలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు సానుకూలంగా స్పందిస్తూ, దేవరకొండ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని చర్యలు తక్షణమే తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రితో భేటీ అనంతరం ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని, దేవరకొండ నియోజకవర్గ సంక్షేమానికి, అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.



# గోశాలలో గోవులకు మౌలిక వసతులు ఏవి..?

- సంబంధిత శాఖల అనుమతులు ఉన్నట్లేనా..?
- అధికార దుర్వినియోగం జరుగుతుందా..!



**చింతపల్లి, జూలై05(నేటి దర్శిని):**
రాష్ట్రంలో గోవుల సంరక్షణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు గోవుల సంరక్షణపై ప్రభుత్వం సమీక్ష సమావేశం కూడా నిర్వహించారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులను దానం చేస్తుంటారు కానీ వాటికి సరైన నివాస స్థలాలు వసతులు లేని కారణంగా గోవులు తరచూ మృత్యువాత పడుతున్నాయని, అదేవిధంగా గోవుల సంరక్షణ కోసం సమగ్రమైన విధానాన్ని రూపొందించాలనే నిబంధనలు ఉన్నాయి. గోశాల ప్రారంభించాలంటే నిర్దిష్టమైన చట్టపరమైన అవసరాలు, విధివిధానాలను పాటించాల్సి ఉంటుంది. గోశాలను లాభాపేక్ష లేని సంస్థగా నమోదు చేసి, స్థానిక జాతీయ జంతు సంక్షేమ చట్టాలను పాటించడం గోవుల సంరక్షణకు తగిన సౌకర్యాలు ఉన్న భూమిని ఏర్పాటువంటి ముఖ్యమైన దశలుగా పేర్కొన్నారు. హిందూ సంస్కృతిలో పవిత్రమైన జంతువులుగా పూజింపబడే ఆవులకు సంరక్షణ, రక్షణ అందించి తరచూ వాటిని వధ చేయడం, విడిచిపెట్టడం వంటి వాటి నుండి కాపాడేవే గోశాలలు. గోశాలలో ఆవులకు పోషణ,ఆహారం, వైద్య చికిత్స వంటి అత్యవసరాలు గోశాల యజమానులు పాటించాల్సి ఉంటుంది. జంతు సంక్షేమ నిబంధనలు తప్పక పాటించాలని చట్టాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోని చింతపల్లి మండలంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ వారాహి గోశాల సేవా ట్రస్ట్ పేరున బాలాజీ తండా సమీపంలో 78 గోవులతో గోశాల ఏర్పాటు చేశారు. జాతీయ పశుసంవర్ధక శాఖ (అనిమల్ హస్బెండరీ ) నుండి అనుమతులు తీసుకోలేదని తెలుస్తోంది. ఏర్పాటు చేసిన వారాహి గోశాల లో గోవులకు తగిన మౌలిక వసతులు లేవని, గోవులకు ఏదైనా వ్యాధులు సంభవిస్తే పరీక్షించడానికి వైద్యాధికారి అనుమతి కుడా లేదని జంతు ప్రేమికులు ఆరోపిస్తున్నారు. గోశాలలో ఇతర సౌకర్యాలు నిర్మించడానికి అవసరమైన భవన నిర్మాణం అనుమతులు ఉన్నాయా.. నైపుణ్యం కలిగిన సంరక్షకులు, పశు వైద్య నిపుణులతో సహా సిబ్బందిని నియమించారా...? గోశాల నిర్మాణానికి ఎంత భూమి లీజుకు తీసుకున్నారు... గోశాల నిర్మాణ స్థలం నాన్ అగ్రికల్చర్ భూమిగా మార్చారా అయితే రెవిన్యూ శాఖ నుండి ఎటువంటి అనుమతులు తీసుకున్నారు ...? ఎన్ని ఎకరాల భూమిని గ్రామపంచాయతీ అనుమతితో లీజుకు తీసుకున్నారు..? 78 గోవులతో గోశాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆగోవులన్నీ క్షేమమేనా...? అని జంతు ప్రేమికులను వేధిస్తున్న సమస్యలు. గోశాల ఏర్పాటు చేయగానే భక్తులు గోదానం ఇచ్చేవారి సంఖ్య పెరుగుతుంది. గోశాలలో గోవులకు సంబంధించిన ప్రతి విషయం ప్రజలకు తెలిసేట్టుగా రిజిస్టర్ మైంటైన్ చేసి గోశాలకు ట్రస్ట్ పేరుతో బయట బోర్డు ఏర్పాటు చేయాలి. గోవులు అక్రమ రవాణా జరుగుతున్న తరుణంలో అధికారులకు స్థానిక పెద్దలకు విచారించే అవకాశం కల్పించాలి.

# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఎల్బీనగర్ వికలాంగుల విభాగం ఇన్‌చార్జిగా బి. రామచంద్రయ్య నియామకం



**ఎల్బీనగర్, జూన్ 05 (నేటి దర్శిని):**
తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ వికలాంగుల విభాగం ఇన్‌చార్జిగా బి. రామచంద్రయ్యను రాష్ట్ర అధ్యక్షులు కాంచన సత్యనారాయణ నియమించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బి. రామచంద్రయ్య చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. 2001 నుంచి 2014 వరకు సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో అప్పటి ఎల్బీనగర్ ఇన్‌చార్జిగా కాంచన సత్యనారాయణ నాయకత్వంలో బి. రామచంద్రయ్య చురుకుగా పనిచేశారని పేర్కొన్నారు. శ్రీకాంతాచారి ఆత్మాహుతి అనంతరం ఎల్బీనగర్ పరిధిలోని ఆరు వికలాంగుల హాస్టళ్ల విద్యార్థులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయినా ఉద్యమంలో పాల్గొన్న వికలాంగులకు తగిన గుర్తింపు, ప్రాధాన్యం లభించలేదని కాంచన సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘంలో వికలాంగుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, ఎల్బీనగర్ వికలాంగుల విభాగం ఇన్‌చార్జిగా బి. రామచంద్రయ్యను నియమించినట్లు తెలిపారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్రంలోని పలు వికలాంగుల సంఘాల ప్రతినిధులు స్వాగతిస్తూ, కాంచన సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ఉద్యమంలో పాల్గొన్న వికలాంగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం మరింత సమన్వయంతో పనిచేస్తామని సంఘం నాయకులు వెల్లడించారు.

